janodaya

# జనోదయ

RNI No - APTEL/2022/81596

కరీంనగర్ శుక్రవారం 03.04.2026 సంపుటి : 03 సంచిక : 118 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Friday 03.04.2026 Volume: 03 Issue 118 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక







# సంక్షేమం,అభివృద్ధిపై రాజీలేదు



**సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం పని చేస్తోందని, పాలకులం కాదు.. సేవకులం అనే భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

### ఇది సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష

### గ్రామ సభలకు సీఎం రేవంత్ సందేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :** సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం పని చేస్తోందని, పాలకులం కాదు.. సేవకులం అనే భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గురువారం జరిగిన గ్రామసభలకు సీఎం సందేశం అందించారు. 'ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండేళ్ల 3 నెలలు పూర్తయింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మీరిచ్చిన విజయాలు మా బాధ్యతను పెంచాయి' అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నదే తమ సంకల్పమని, ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మార్చి 6 నుంచి 99 రోజులపాటు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఉద్యమంలా సాగాలని ఆకాంక్షించారు. "ఇది ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల ప్రజలు ఒక్కటై.. దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామికావాలి. అందుకు మీ సహకారాన్ని కోరుతున్నా' అని ఆ సందేశంలో పేర్కొన్నారు.






## రవి వర్మ చిత్రానికి రూ.167 కోట్లు..

### సైరస్ పూనావాలా కొనుగోలు



**న్యూఢిల్లీ:** ప్రఖ్యాత భారత చిత్రకారుడు రాజా రవి వర్మ 1890లో గీసిన 'యశోద అండ్ కృష్ణ' చిత్రం ఈ నెల 1న జరిగిన వేలంలో రూ.167 కోట్ల ధర పలికింది. సీరమ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత సైరస్ పూనావాలా ఈ చిత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ చిత్రాన్ని వేలం వేసిన సాఫ్రాన్ ఆర్ట్స్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్ దీనికి రూ.80-120 కోట్లు రావొచ్చని అంచనా వేసింది.అయితే గత రికార్డులను చెరిపేస్తూ అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఒక భారతీయ కళాఖండంగా ఈ చిత్రం నిలిచింది. దీన్ని కొనుగోలు చేసిన పూనావాలా మాట్లాడుతూ.. 'జాతీయ సంపద అయిన రాజా రవి వర్మ చిత్రాన్ని కొను గోలు చేసి భద్రపరిచే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలు దీన్ని చూసేందుకు అందుబాటులో ఉంచుతాను' అని వ్యాఖ్యానించారు.

## ఫ్యూచర్ సిటీ పనులను పరిశీలించిన సీఎం

### అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం



**రంగారెడ్డి, ఏప్రిల్ 2 :** రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా కొనసాగుతున్న ఫ్యూచర్ సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. సాయంత్రం 4 గంటలకు ఫ్యూచర్ సిటీకి చేరుకున్న ఆయన, 5 గంటల వరకు వివిధ పనుల పురోగతిని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో నిర్మాణం చేపట్టిన పరిపాలనా భవనం, స్కిల్ డెవలప్‌మెంట్, రోడ్ల పనులను అడిగి తెలుసుకున్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి చేపట్టబోయే పనులను అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు వివరించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ పరిపాలనా భవనాన్ని త్వరగా పూర్తిచేసి ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు.

## కోల్‌కతాపై హైదరాబాద్ ఘన విజయం

### 'ట్రావిషేక్' మెరుపులు

### రాణించిన క్లాసెన్, నితీశ్



**కోల్‌కతా:** ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 227 పరుగుల లక్ష్యఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకు కుప్పకూలింది. జైదేవ్ ఉనద్కత్ (3/21), ఇషాన్ మలింగ(2/14), నితీశ్‌కుమార్(2/17) ధాటికి నిలదొక్కుకోలేకపోయింది. రఘువంశీ(52) మినహా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్.. హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52, 4 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48, 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 రన్స్ చేసింది

## ఏసుక్రీస్తు త్యాగం, ధైర్యం మరువలేనివి

### సీఎం రేవంత్ రెడ్డి..

**హైదరాబాద్:** గుడ్ ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు త్యాగం, ధైర్యాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.ప్రభువు ప్రేమ, కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని అభిలషించారు. శాంతి, కరుణ సందేశాలతోపాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ, ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకమన్నారు. ఏసుక్రీస్తు త్యాగాలకు జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడేను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ భక్తి, శ్రద్ధలతో నిర్వహించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# 15వ వార్డు అభివృద్ధే లక్ష్యం

**జనోదయ : చెన్నూరు ఆర్సీ**

చెన్నూరు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా చెన్నూరు మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలు జోరందుకున్నాయి. రాష్ట్ర కార్మిక మరియు మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, గురువారం 15వ వార్డులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 15వ వార్డు కౌన్సిలర్ కొమ్మర జయలక్ష్మి బ్రహ్మయ్య వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. ప్రధానంగా మురుగునీటి కాలువలు, రహదారులు, త్రాగునీరు మరియు వీధి దీపాల వంటి



మౌలిక వసతులపై ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొమ్మర జయలక్ష్మి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా, మంత్రి వివేక్ వెంకటస్వామి మార్గదర్శకత్వంలో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారుల సమన్వయంతో సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. సమస్య చిన్నదైనా, పెద్దదైనా నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరిస్తామని అధికారుల వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ అధికారులు స్పెషల్ ఆఫీసర్ వినీత్ మున్సిపల్ కౌన్సిలర్ జయలక్ష్మి బ్రహ్మయ్య మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి బీసీ జేఏసీ చైర్మన్ రమేష్ యాదవ్ వార్డు సభ్యులు రేణుక పద్మ పాల్గొన్నారు

# గ్రామ సభలో గందరగోళం

**ఈజీఎస్ నిధులపై నిలదీత**

**రసాభాసగా ముగిసిన గ్రామసభ**

**జనోదయ, మంథని:**

కాకర్లపల్లిలో గురువారం జరిగిన గ్రామ సభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈజీఎస్ నిధులు మళ్లిపోతున్నాయని గ్రామస్థులు సర్పంచ్‌ను నిలదీశారు. సర్పంచ్ అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని ఉప సర్పంచ్ ఆకుల ప్రత్యూష ఆరోపించారు. సర్పంచ్ కన్నెబోయిన కొమురయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రత్యేక అధికారి లక్ష్మి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వివరించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, రోడ్డు భద్రత, వ్యవసాయం,



మహిళా సంక్షేమం వంటి అంశాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ అభివృద్ధి పనులు, నిధుల విని యోగంపై చర్చ సందర్భంగా పరస్పర ఆరోపణలతో గందరగోళం నెలకొంది. అధికారులు ప్రజల అభిప్రాయాలను సేకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రజల భాగస్వామ్యంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ అభివృద్ధికి చర్యలు**

**రామగిరి మండలం కల్వచర్ల గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**జనోదయ, మంథని, (రామగిరి)**

ప్రజల భాగస్వామ్యంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తుందని అన్నారు. 99 రోజుల స్పెషల్ ప్రోగ్రాం క్రింద



పారిశుధ్య నిర్వహణ, పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, వైద్యశాఖ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు,రోడ్డు భద్రత పై అవగాహన, వ్యవసాయం ,మహిళా సంక్షేమం వంటి వివిధ రంగాలపై ప్రత్యేక కార్యక్రమాలు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టే కార్యక్రమాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేడు గ్రామ సభ నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల సంబంధించి ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రభు త్వానికి అందించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై సలహాలు అందించాలని అన్నారు. డిసెంబర్ నెలలో గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతంగా ముగిసి పాలక వర్గాలు ఏర్పడ్డాయని, 15 వ ఆర్థిక సంఘం సంబంధించి పెండింగ్ నిధులు ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. గ్రామాల వద్ద అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ అవసరాల మేరకు చేపట్టాలని, గ్రామ సభ కార్యక్రమంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు అనే అంశం పై చర్చించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**4.70 లక్షల విలువ గల**

# గుట్కాల పట్టివేత

**నిందితుడు రాజ్ పుత్ చేతన్ అరెస్ట్**

**హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్**



**జనోదయ, వరంగల్ క్రైమ్, ఏప్రిల్ 2:**

హనుమకొండ నగరం నడిబొడ్డులో గల టైలర్ స్ట్రీట్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర శివం కిరాణా స్టోర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను(గుట్కాలను) పట్టుకున్నట్లు హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు హన్మకొండ ఎస్సై కిషోర్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది మహిపాల్, తిరువర్ధన్ అట్టి కిరాణా షాప్ పై రైడ్ చెసి గుట్కాలు స్వాధీనపరుచుకున్నట్టు తెలిపారు. నిందితుడు రాజ్ పుత్ చేతన్ అట్టి నిషేధిత పొగాకు ఉత్పత్తులను ఇతర ప్రాంతాల నుండి తెప్పించి ఇక్కడ పలు షాపుల వారికి అమ్ముతున్నట్టు విచారణలో వెల్లడైంది అని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

# రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే నాయిని



**జనోదయ,హనుమకొండ, ఏప్రిల్ 02:**

హనుమకొండ హంటర్ రోడ్డు జూపార్క్ సమీపంలో ఉన్న రీజనల్ సైన్స్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ సైన్స్ సెంటర్ పని విధానంతో పాటు అక్కడ ఉన్న వివిధ శాస్త్ర సాంకేతిక పరికరాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. సైన్స్ సెంటర్ లో పనిచేయని పలు పరికరాలను , భవనంలో సౌకర్యాల ఏర్పాట్లను గురించి వారు ఆరా తీశారు. రీజినల్ సైన్స్ సెంటర్‌లో నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కల్పన గురించి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే, కుడా ఛైర్మన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కావలసిన మరమ్మతులు చేయించాలని సూచించారు. తగిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులతో పాటు రీజనల్ సైన్స్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# పెండ్లి అయిన 40 రోజులకే నవవధువు ఆత్మహత్య

**జనోదయ : శేరిలింగంపల్లి ఏప్రిల్ 2:** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, బీహార్ రాష్ట్రానికి చెందిన ఇషిక యాదవ్ ,మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ బన్సల్ 2020 సంవత్సరంలో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పరచుకుని పరస్పరం ప్రేమించుకున్నారు. అనంతరం పెద్దల సమక్షంలో 20-02-2026 తేదీన వివాహం చేసుకున్నారు.వివాహానంతరం దంపతులు మియాపూర్‌లోని మక్త మహబూబ్‌పేట్ ప్రాంతంలోని ఒక అపార్ట్మెంట్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, ఇటీవల కాలంలో అదనపు కట్నం తీసుకురావాలని భర్త నీరజ్ బన్సల్ తన భార్య ఇషిక యాదవ్‌ను మానసికంగా వేధిస్తున్నాడని ప్రాథమికంగా తెలిసింది. ఈ వేధింపులను తట్టుకోలేక ఇషిక యాదవ్ తమ నివాసంలోని హాల్‌లో ఫ్యాన్‌కు చున్నీ సహాయంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.బుధవారం ఉదయం సమయంలో భర్త గమనించి స్థానికుల సహాయంతో ఆమెను కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.



### ఇందిరమ్మ ఇండ్ల పేరుతో

# పేదలకు గూడు లేకుండా చేయకండి

**నడిగడ్డ తాండ గిరిజన సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్**

**జనోదయ : శేరిలింగంపల్లి**

గురువారం మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండావాసులు శేరిలింగంపల్లి మండల రెవెన్యూ కార్యాలయ ఆఫీసర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. తామంతా గత 50 సంవత్సరాలకు పైగా ఈ ప్రాంతంలోనే జీవించుచున్నామని, ఎస్సీ ఎస్టీ బీసీ ఇతర మైనార్టీ వర్గాల చెందిన, పేదవాళ్ళమని, ఈ ప్రాంతంలో చుట్టుపక్కల కూలి పనులు చేస్తూ మరియు ఇతర చిన్న చిన్న పనులు చేస్తూ జీవిస్తున్నామని, మమ్ములను వేరే ప్రాంతానికి తరలించిన మా జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి మాకు ఎలాంటి లబ్ది కలగక పోయిన మాకు మేమే జీవనోపాధి కల్పించుకుని బతుకుతున్నాం . ఈ పరిస్థితుల్లో మరో ప్రాంతానికి తరలించి గృహ నిర్మాణం జరిపి మా జీవనోపాధికి ముప్పు చేయకండి, ప్రజా ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు అనే పథకం కింద పేదలు నివసిస్తున్న స్థలాలలో ఇండ్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇచ్చి ఇల్లు కట్టిస్తామని హామీని అమలు చేయాలని అందులో భాగంగామా తండా లో ఉన్న ప్రతి కుటుంబానికి 5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇప్పుడు మేమున్న స్థలాలలో యధావిధిగా మా ఇండ్లు మేము నిర్మించుకొనుటకు ప్రభుత్వం అనుమతించాలని తండా గిరిజన సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.



# స్వీపింగ్ కార్మికుల తొలగింపుపై నిరసన

**వినతి పత్రం సమర్పణ**

**జనోదయ, మంథని:**

మంథనిలో ఆర్టీసీ స్వీపింగ్ కార్మికులను తొలగించడం తీవ్ర అన్యాయం అని సిఐటియు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయలో మంత్రి పిఏ ఆకుల చంద్రశేఖర్‌కు స్వీపింగ్ కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ, ముత్యాలమ్మవాడకు చెందిన నిరుపేద దళిత మహిళలు గత 20 సంవత్సరాలుగా మంథని ఆర్టీసీ డిపో,బస్టాండ్‌లో స్వీపింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు.



ఉద్యోగాల కుదింపు పేరుతో వారిని తొలగించడం అన్యాయమని,ఇప్పటికే తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ఈ కుటుంబాలు ఇప్పుడు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించి ఈ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుని యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏల్పుల సురేష్, కెవిపిఎస్ నాయకులు మంథని లింగయ్య, డివైఎఫ్ఐ నాయకులు గొర్రెంకల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబు రవి,స్వీపింగ్ కార్మికులు రాజమణి,రాజేశ్వరి,వెంకటమ్మ, శంకరమ్మ,మమత, స్వరూప పాల్గొన్నారు.

## నమోదైన నిర్మాణ కార్మికులకు శుభవార్త

# పిల్లలకు విదేశీ ఉద్యోగావకాశాలు

**జనోదయ, మంథని:**



కార్మిక శాఖలో నమోదైన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. కార్మికులు సంవత్సరాలుగా సంపా దించిన నైపుణ్యాలను అధికా రికంగా గుర్తిస్తూ "నైపుణ్యాల గుర్తింపు కార్యక్ర మం" చేపట్టనుంది. దీని ద్వారా అర్హు లైన వారికి విదేశాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.అలాగే నమోదైన నిర్మాణ కార్మికుల పిల్ల ల్లో 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల, కనీసం 8వ తరగతి విద్యార్హత ఉన్న వారికి ఉచితంగా భాషా, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ అందించబడుతుంది. ఈ శిక్షణ అనంతరం విదేశీ ఉద్యోగాలకు అవకాశాలు కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకునే వారు పెద్దపల్లి, మంథని, గోదావరిఖని కార్మిక శాఖ కార్యాలయాలను సంప్రదించాలని ఉప సహాయ కార్మిక కమిషనర్, నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు. కుటుంబ భవిష్యత్తు మెరుగుపర్చుకునేందుకు ఇది మంచి అవకాశం అని సూచించారు.

### అతిథి అధ్యాపకుల

# వినతి పత్రం సమర్పణ



**జనోదయ,మంథని:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో కూడా తమ సేవలను కొనసాగిస్తూ, 12 నెలలపాటు నెలకు రూ.50,000 జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పరిషయ్యకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు తమ ఉద్యోగ భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అతిథి అధ్యాపక సంఘం అధ్యక్షుడు ఉడుత ముకుందం, అలాగే కళాశాల అతిథి అధ్యాపకులు అమర్నాథ్, ఫర్జానా, మానస, రజిత, దుర్గం కృష్ణ, శేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.







## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

# సర్వాయి పాపన్న వర్ధంతి

**జనోదయ,మంథని:**

మంథనిలో సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్ ఆధ్వ ర్యంలో గురువారం ఘనంగా నిర్వ హించారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మండల అధ్యక్షులు ఐలి ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న చిత్రప టానికి పూలమాలవేసి ఘనంగా నివా ళులర్పించారు.ఈ సందర్భంగా మం డల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని స త్యం, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్య క్షులు ఎరుకల ప్రవీణ్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పుర స్కరించుకుని చరిత్ర నిర్మాణంలో తనదైన చెరగని పాత్రను నిర్వర్తించిన ఒక మహాయోధుడు తెలంగాణ గడ్డపై జన్మించాడనీ అతడే సర్దార్ సర్వాయి



పాపన్న అన్నారు. పీడిత ప్రజలకు రక్షకుడిగా నిలిచి దళిత, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధిం చవచ్చని మొట్టమొదటిసారిగా నిరూ పించాడన్నారు. దాదాపు 350 ఏండ్ల క్రితమే కుల, మత, జాతివర్గ విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన బ హుజన పోరాట యోధుడు, గొప్ప సా మాజిక బహుజనవిప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న.ఆధిపత్య అగ్రకుల పాలకులు బహుజనులను అణగదొ క్కుతున్న 17వ శతాబ్దంలో స్వీయ సైన్యంతో దక్కన్పై బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని బహుజన రాజ్య స్థా పన చేసిన గొప్ప వీరుడు, మహాత్మా జ్యోతిబా పూలే కంటే ముందే సామా జిక న్యాయం అమలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు.రాచరికపు వ్యవస్థ నీడలో అగ్రకులాల ఆధిపత్యా నికి వ్యతిరేకంగా జమీందార్లు, జాగీర్దా రుల అరాచకాలను సహించలేక కదు పు మండి కత్తి పట్టిన వీరుడనీ కొని యాడారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం లీగల్ సెల్ అడ్వైజర్ మంద ప్రణయ్ కుమార్‌కు

# జెఎస్ఎస్ సభ్యుల పరామర్శ



**జనోదయ, హనుమకొండ, ఏప్రిల్ 02:**

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్ మంద ప్రణయ్ కుమార్ తండ్రి మంద దేవా దాసు బుధవారం రాత్రి 11:00 గంటలకు బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టి మరణించగా, వారి కుటుంబాన్ని జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా మిత్ర బృందం వారిని పరా మర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. నరేష్, చీకటి సతీష్ పాల్గొన్నారు.

## కోటపెల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**జనోదయ : చెన్నూరు ఆర్సీ**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా గురు వారం రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సర్పంచ్ ఆలూరి సం పత్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రజా పాలనలో బాగంగా ప్రభుత్వ ఆరు గ్యా రంటీల వలన లబ్ది పొందుతున్న కోటపల్లి లబ్దిదారుల జా బితాను గ్రామ ప్రజలకు చదివి వినిపించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆలూరి సంపత్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కోటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రైతు భరోసా పథకంతో రైతులు లబ్ధి పొందున్నా రన్నారు.గృహ జ్యోతి పథకం ద్వార 200 యూనిట్ల ఉచిత కరెంట్, చేయూత పెన్షన్స్ కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకం అని తెలిపారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల జడ్పీ సీఈఓ గణపతి ప్రత్యేక అధికారి రాఘవేందర్ రావు , కార్యదర్శి గోదారి సమ్మయ్య ,ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు రైతులు యువకులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు, బాలింతల అంబులెన్స్‌లకు దారి ఇవ్వండి

**-పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**

చందకాంతయ్య మెమోరియల్ ప్రసూతి ఆసుపత్రి కి వెళ్ళే గర్భిణీ స్త్రీల మరియు బాలింతల అంబులెన్స్ లకు దారి ఇవ్వా లని హాస్పిటల్ ఆర్ఎంవో సత్య జిత్ వినతి సమర్పించిన వివిధ ప్రజా సం ఘాల నాయకులు అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం కొన్ని వేల మం ది గర్భిణీ స్త్రీలు, బాలింతలు వివిధ ప్రాంతాల నుండి ప్రసూతి నొప్పులతో బాధ పడుతూ ఆటోలలో మరియు అంబులెన్సు లలో వచ్చి వెళ్తూ ఉంటా రని, వీరికి ఆసుపత్రి నుండి పోస్ట్ ఆఫీస్ చౌరస్తా మీదుగా అండర్ బ్రిడ్జి వరకు చిరు వ్యాపారస్థులు రోడ్డు కి



ఇరు వైపులా రోడ్డు కబ్జా చేసి పందిర్లు వేసుకొని ట్రాఫిక్ అంతరాయం కలిగి స్తూ.. ఉండడం వల్ల కొందరు గర్భిణీ లు ట్రాఫిక్ లోనే చిక్కుకొని ప్రసవిస్తూ ఉన్నారని అన్నారు. ఇప్పటికయినా సీకేఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూడాలని అన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఉండాలంటే చిరు వ్యాపారస్తులను కూరగాయల మార్కెట్ కు తరించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఆర్ఎంవో కు వినతి పత్రం సమర్పించిన వారిలో పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్, ఆకుల సురేష్ కుమార్, చింత ఆనంద్, మైదశీ సంజీవ, ఎండి సలీం, కొంరయ్య, రౌతు శ్రీనివాస్, మేడిగ సతీష్ తదితరులు ఉన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**జనోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 02:**

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం రామ గుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 47, 48, 49 డివిజన్లు మరియు 8వ డివిజన్‌లో నిర్వహించిన గ్రామ సభ "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థాని క ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమ స్యలు, అవసరాలు, అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి సమ స్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశు ధ్యం, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మరింత పురోగతి సాధిం చాలని సూ చించారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన -- ప్రగ తి ప్రణా ళిక కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరగా పాలన చేరడం, వారి అభిప్రా యాలను ప్రణాళికల్లో ప్రతిబింబించడం ముఖ్య లక్ష్య మని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల భాగ స్వామ్యంతోనే నిజమైన అబి




. వృద్ధి సాధ్య మవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికా రులు, కార్పొరేటర్లు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్ర మంలో రామ గుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## రచనలకు ఆహ్వానం

నిత్య నూతనంగా వెలువడుతూ అశేష పాఠకాదరణ పొందుతున్న 'జనోదయ' , వాస్తవం తెలుగు దినపత్రికకు సమ కాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య,వైద్యం, స్పోర్ట్స్, వ్యవసాయం, శాస్త్రసాంకేతికం, సాహిత్యం, కథలు, నవలలు, వినోదం ..ఇలా అనేక అంశాల మీద వ్యాసాలు, రచనలకు ఆహ్వానం. మీ రచనలను కంపోజ్ చేసి కింది వాట్సాప్ నంబర్‌కు పంపాలి.

ఎడిటర్
వాస్తవం, జనోదయ
తెలుగు దినపత్రిక
**8074124190**

......................................................

**నోట్ :** అంశం ఏదైనా విభిన్న శైలిలో, పాఠకులకు హత్తుకునేలా, విజ్ఞానాన్ని పంచేలా ఉండాలి. కంపోజ్ చేసిన వ్యాసాలకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. వ్యాసాల ప్రచురణ విషయంలో సంపాద కుడిదే తుది నిర్ణయం.ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

# కాల్వలపై అక్రమ నిర్మాణాలను తొలగించండి

**- అధికారులకు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశం**

**జనోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 02:** కాలువలపై వెలసిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశించారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి 39 వ డివిజన్ శివాజీ నగర్ , కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొందల గడ్డగా మారిన రామగుండంను నవ నిర్మాణం చేస్తున్న క్రమంలో కాలువలు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా స్వచ్ఛ మైన నగరంగా రూపొందించడానికై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పాలక వర్గం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. వర్షాకాలంలోపు నగరంలోని అన్ని డ్రైయిన్‌లలో పూడిక తొలగించాలని అన్నారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు. రామగుండం నగరం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ప్రజలు వలస వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. నగరంలోని మారుమూల నుండి సిటీ సెంటర్ వరకు 25 నిమిషాల్లో చేరుకునేలా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సకల వసతులతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గత పదేళ్లుగా కాలువల్లో పూడిక తొలగించకుండా పేరుకుపోయిన నేపథ్యంలో వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధులు ప్రబలడం, దుర్వాసనతో కాలువల చుట్టు ప్రక్కల నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతుండడంతో ప్రథమ ప్రాధాన్యతగా కాలువలలో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు.నగరంలో అన్ని కాలువల్లో సంపూర్తిగా పూడిక తొలగించేవరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అన్నారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ముందే చెప్పినట్టుగా రెండు చెత్త డబ్బాలు ప్రతి దుకాణం ముందు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ ప్రక్కన ఉన్న కాలువలో పూడిక తొలగించడంతో పాటు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తిప్పారపు మానస, నాయకులు తిప్పారపు శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి,ఎస్ ఇ గురువీర ఇఇ రామన్ ,టిపిఎస్ నవీన్, డిఇలు ,ఎఇలు పాల్గొన్నారు



# ఐటీ కారిడార్‌లో
# ట్రాఫిక్ కష్టాలకు 'షేరింగ్'తోనే చెక్

**మాదాపూర్ పోలీసుల సర్వేలో ఆసక్తికర అంశాలు**

**జనోదయ : శేరిలింగంపల్లి**

ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించే వారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 అధికంగా ఉండటం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని ఈ సర్వేలో స్పష్టమైంది.ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం వృథా కావడంతో పాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల రిస్క్ మరియు శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనికి తోడు వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ తెలిసినప్పటికీ, అధిక శాతం మంది ఒంటరిగా ప్రయాణించడానికే మొగ్గు చూపడం ఆశ్చర్యకరమని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ సర్వే కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ-1 హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ఎస్ హెచ్ఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములు మరియు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఐటీ ఉద్యోగులు మరియు సాధారణ పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్‌ను నిర్మించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.






జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190



# సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### గంగాధర మండలంలోని గ్రామాల్లో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభలు... ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరు



**జనోదయ : గంగాధర ఏప్రిల్ 02:** గంగాధర మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గానికి ఇప్పటికే 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూర య్యాయని, మరో 3500 ఇండ్లు త్వరలో మంజూరు కానున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంది రమ్మ ఇండ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని, ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, నాసిర కం బియ్యం అందించారని విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.

# ఎల్లంపల్లి పైప్‌లైన్ ధ్వంసం

### 50 ఎకరాల పంట నీటమునిగి రైతులకు భారీ నష్టం



**జనోదయ గంగాధర ఏప్రిల్ 02:** ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను కరీంనగర్ జిల్లా గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి శివారు లోగల నారాయణపూర్ రిజర్వాయర్‌కు తరలించే ఎల్లంపల్లి పైప్‌లైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరు పొలాల్లోకి చేరి సుమారు 50 ఎకరాల్లో కోత దశకు వచ్చిన పంట నీటమునిగిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించిన అధికారులు త్వరలోనే పైప్‌లైన్ మరమ్మత్తులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యేను కూడా రైతులు సంప్రదించగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే గంగాధర పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు రైతులు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్యలు తీసుకొని పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన దుండగులను పట్టుకోవాలని, అలాగే పంట నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం

# ఒక చారిత్రాత్మక ఘట్టం




### ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళ రాజు

**జనోదయ : డి. హీరేహాళ్ ఏప్రిల్ 02** అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించడం ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఆనందాన్ని కలిగించే విషయం మరియు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే చారిత్రాత్మక ఘట్టం. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు ఆధ్వర్యంలో కృతజ్ఞతా సభా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగళ్ళి రాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్‌కి, ఈ చారిత్రాత్మక బిల్లుకు ఆమోదం తెలిపిన అన్ని పార్టీలకు, అలాగే రాజధాని కోసం ఎన్నో సంవత్సరాలుగా నిరంతరంగా పోరాడిన అమరావతి రైతులు, మహిళలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమరావతిని ఏకైక రాజధానిగా నిర్ణయించుకున్నాం. ఇప్పుడు చట్టబద్ధత కల్పించడంతో అమరావతి శాశ్వత రాజధానిగా స్థిరపడింది. త్వరలో కేంద్ర గెజిట్ వెలువడడంతో ఈ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, పోరాటం చేసిన మహిళల త్యాగాలకు ఈ చట్ట బద్ధత నిజమైన గౌరవం. మన కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం సమగ్ర అభివృద్ధి సాధించేలా కృషి చేస్తాం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టి, పట్టుదల వల్లే ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధ్యమైందని ప్రభుత్వాలు మారినా రాజధాని మారకూడదనే లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయం స్వర్ణాంధ్ర నిర్మాణానికి బలమైన పునాది అవు తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిప్పే స్వామి, శ్రీరాములు,వన్నూరు స్వామి, సురేష్, సునీల్,మోహన్, సిద్ద, అంజి, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

# ఉరివేసుకొని మహిళ మృతి



**జనోదయ : గంగాధర ఏప్రిల్02:** గంగాధర మండల పరిధిలోని మధురానగర్ గ్రామానికి చెందిన దూస లత భర్త శంకరయ్య, వయస్సు 45 సంవత్సరాలు కలిగిన మహిళ తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రాగా ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే గంగాధర ఎస్సై వంశీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి ,పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. కుటుంబ సభ్యులు మరియు స్థానికుల ప్రకారం, ఆత్మహత్య చేసుకున్న మహిళ గత సంవత్సర కాలంగా మానసిక స్థితి సరిగా లేక బాధపడుతుండేది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా నయం కావడంలేదు. నిన్న సాయంత్రం వరకు బాగానే ఉన్న మహిళ ఈ రోజు ఉదయం మహిళ పడుకున్న గది యొక్క తలుపు తియ్యకపోయేసరికి అనుమానంతో మహిళ భర్త గది తలుపు లు పగులగొట్టి చూసేసరికి ఇంట్లో కిటికీ ఉన్న వైర్ తో ఉరిపెట్టుకొని చనిపోయి ఉన్నట్లు మహిళ భర్త శంకరయ్య పిర్యాదు చేయగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

# సిలువపై ప్రేమ గెలిచిన రోజు

**నేడు గుడ్ ఫ్రైడే**

**ప్రేమ శాంతికి నిదర్శనం క్రీస్తు బోధనలు**

**జనోదయ : మంథని**

మానవాళి చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన, త్యాగపూరితమైన ఘట్టం గుడ్ ఫ్రైడే. ఇది కేవలం ఒక మరణం గురించిన కథ మాత్రమే కాదు, నిస్వార్థమైన ప్రేమ కు, క్షమాగుణానికి నిదర్శనం. రెండు వేల ఏళ్ల క్రితం, యెరూ షలేము వీధులు గందరగోళంతో నిండిపోయాయి. ఏ పాపమూ ఎరుగని యేసుక్రీస్తుపై నేరాలు మోపి, ఆయనకు సిలువ మరణాన్ని ఖరారు చేశారు.సిలువ మార్గం యేసు తన భుజాలపై బరువైన సిలువను మోస్తూ గొల్గొత్తా కొండ వైపు నడిచారు.ఆయన తలపై ముళ్ల కిరీటం పెట్టారు. సైనికులు ఆయ నను కొరడాతో కొడుతూ, అవమానిస్తూ ఉన్నా ఆయన నోరు విప్పలేదు.దారి పొడవునా ప్రజలు ఆయనను చూస్తూ కన్నీరు పెట్టారు. కలువరి కొండపై క్షమాపణ మధ్యాహ్నం 12 గంటల సమయం లో,ఆయనను సిలువపై ఉంచి చేతులకు,కాళ్లకు మేకులు కొట్టారు. ఆ భయంకరమైన నొప్పిలో కూడా యేసుక్రీస్తు తనను హింసిస్తున్న వారిని చూసి ద్వేషించలేదు. దేవుని ప్రార్థిస్తూ ఇలా అన్నారు: “తండ్రీ, వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు; వీరిని క్షమించుము.” అపారమైన బాధలో ఉన్నప్ప టికీ,తన పక్కనే సిలువ వేయబడిన ఒక దొంగ పశ్చాత్తాపం చెందగా, అతనికి పరలోక రాజ్యంలో చోటు ఉంటుందని వాగ్దానం చేశారు. ప్రకృతి స్పందన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో, అప్పటివరకు వెలుగుగా ఉన్న సూర్యుడు మరుగైపోయాడు. దేశమంతటా చీకటి కమ్మింది. యేసు బిగ్గరగా కేక వేసి, “సమస్తమును సంపూర్ణమైనది” అని పలికి తన ప్రాణాన్ని వదిలారు.ఆ క్షణమే దేవాలయంలోని తెర పైనుండి క్రిందికి రెండుగా చినిగిపోయింది, భూమి వణికింది.

**దీనిని 'గుడ్' ఫ్రైడే అని ఎందుకు అంటారు?**

శిక్ష అనుభవించడం బాధాకరమైన విషయమే అయినా, దీనిని 'గుడ్' (శుభ) ఫ్రైడే అని పిలవడానికి కొన్ని ముఖ్య కారణాలు ఉన్నాయి: ప్రేమ: దేవుడు లోకాన్ని ప్రేమించి, మనుషుల పాపాల కోసం తన కుమారుడిని బలిగా ఇచ్చాడని క్రైస్తవుల నమ్మకం. విజయం:ఇది మరణంపై విజయానికి నాంది.పాపం,మరణం యొక్క సంకెళ్లను తెంచడానికి జరిగిన త్యాగం ఇది.నిరీక్షణ:శు క్రవారం మరణం సంభవించినా, ఆదివారం ఆయన తిరిగి లేస్తారనే (ఈస్టర్) గొప్ప నిరీక్షణకు ఇది పునాది.

**ముగింపు**

గుడ్ ఫ్రైడే మనకు నేర్పే పాఠం ఒక్కటే: త్యాగం,క్షమాపణ.ఒకరిని ప్రేమించడం అంటే వారి కోసం మన స్వార్థాన్ని వదులుకోవడం అని యేసుక్రీస్తు తన సిలువ మరణం ద్వారా నిరూపించారు.మౌనంగా ప్రార్థన చేసుకుంటూ,ఆ గొప్ప త్యాగాన్ని స్మరించుకోవడమే ఈ రోజుకు మనం ఇచ్చే నిజమైన గౌరవం.మంథని నియోజకవర్గం లోని 177 చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు జరగనున్నా యి.క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో చర్చిలలో ప్రార్థనలు నిర్వహించ నున్నారు.ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానం చేస్తూ ఉపవాస ప్రార్థనలు నిర్వహించను న్నారు.ప్రేమ శాంతికి నిర్వచనం




క్రీస్తు బోధనలు అంకరి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్,క్రీస్తు బోధనలు ప్రేమ శాంతికి నిర్వచనాలు.ప్రపంచ శాంతి కోసం ఆయన చేసిన త్యాగం మరువలేనిది. అవమా నించిన,కొరడాతో కోడుతున్నా సత్యం వైపు ఆయన నిలబడ్డారు. ప్రపంచ శాంతి కోసం ఆయన తలపై ముళ్ళ కిరీటాన్ని ధరించా రు.పాపులను రక్షించడానికి ఆయన చేసినటువంటి తన నెత్తురును చిందించారు.క్రీస్తు చూపిన దారిలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు ప్రేమతో నడవాలి.గుడ్ ఫ్రైడే వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగును న్నాయి.క్రైస్తవుల అభివృద్ధికి తెలం గాణ ఐటి,పరిశ్రమ ల,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిధులు కేటాయించ డం ఆనందకరమైన విషయం. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృ ద్ధికి కృషి చేయడం హర్షనీయం.

## సమస్యల పరిష్కారానికే

# ప్రజా పాలన గ్రామసభలు



**అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తాం**

**ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**జనోదయ : గంగాధర ఏప్రిల్ 02:**

గంగాధర మండలం మధురానగర్ లో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో మ్మెల్యే మేడి పల్లి సత్యం పాల్గొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను తెలుసుకోవడానికి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక గ్రామ సభలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండ లం మధురానగర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే సత్యం ము ఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు, ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తున్నట్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచితంగా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నట్లు, మరో 3500 ఇండ్లు రానున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజక వర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గత బిఆర్ఎస్ పాల నలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని, ముక్కిపోయిన దొడ్డు బియ్యం ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్య లను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్క రిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని తెలి పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేముల భాస్కర్, ఎంపీడీవో రాము,ఉప సర్పంచ్ తూం రాజు తదితరులు పాల్గొన్నారు.

## 14వ డివిజన్‌లో

# ప్రమాదకర రోడ్డు

**-బొందలు కంకర కుప్పలతో రోడ్డు**

**-తీవ్ర గాయాల పాలైన బీహార్‌కు చెందిన హమాలీ కార్మికుడు రాకేష్**

**-కాంట్రాక్టర్ ,అధికారుల నిర్లక్ష్యమే కారణం**



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ) ఏప్రిల్ 02**

గ్రేటర్ వరంగల్ నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ 1ర్ గేట్ పోలీస్ స్టేషన్ ముందు గొర్రె కుంట క్రాస్ రోడ్డు పూర్తిగా బొందలతో కంకర కుప్పలతో శిధిలమైంది. రాత్రి అయితే ఈ రోడ్డులో కనీసం వీధిలైట్లు లేక వాహనదారులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం రాత్రి సమయంలో బీహార్‌కు చెందిన రాకేష్ అనే వ్యక్తి కోల్డ్ స్టోరేజ్‌లో పనులు ముగించు కుని ఇంటికి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే అతనిని తన కుటుంబ సభ్యులు ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. ఇలా ఈ రోడ్డుపై ఎంతోమందికి ప్రమాదవశాత్తు గాయాలయ్యాయని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు రోడ్డు పరిస్థితి పరిశీలించి తక్షణమే తగు మరమ్మతులు చేయించాలని వాహనదారులు స్థానిక ప్రజలు కోరుతున్నారు.